తెరిపిచ్చిన వాతావరణం

- కృష్ణా జిల్లాలో అక్కడక్కడా మోస్తరు వర్షం
- ఇంకా ముంపులోనే పంట పొలాలు
- సస్యరక్షణ చర్యలు చేపట్టిన రైతులు
- వర్షాలపై రైతుల్లో తొలగని ఆందోళన



కంకిపాడు మండలం పునాదిపాడులో నీటి ముంపులో వరి పొలాలు

కంకిపాడు(పెనమలూరు): కృష్ణా జిల్లాలో ఐదురోజులుగా కురుస్తున్న భారీ వర్షాల నుంచి ప్రజలకు ఊరట లభించింది. గురువారం వాతావరణం తెరిపిచ్చింది. అయితే అక్కడక్కడా చిరు జల్లుల నుంచి మోస్తరు వర్షం కురిసింది. వర్షం ఆగినా పంట పొలాలు మాత్రం ఇంకా ముంపులోనే ఉన్నాయి. ముంపు నివారణ, సస్యరక్షణ చర్యల్లో రైతులు నిమగ్నమయ్యారు.

44.8 మి.మీ. వర్షపాతం

బుధవారం అర్ధరాత్రి వరకూ జిల్లా అంతటా వర్షం కురుస్తూనే ఉంది. గురువారం ఉదయానికి 44.8 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. అత్యధికంగా గన్నవరంలో 74.2, అత్యల్పంగా నాగాయలంకలో 21.2 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. మండలాల వారీగా.. కంకిపాడులో 70.0 మిల్లీమీటర్లు, తోట్లవల్లూరు 67.6, పెనమలూరు 60.6, పమిడిముక్కల 56.8, గూడూరు 56.0, కృత్తివెన్ను 55.6, మొవ్వ 51.2, బాపులపాడు 49.6, గుడ్లవల్లేరు 46.2, బంటుమిల్లి 44.4, చల్లపల్లి 44.2, ఉయ్యూరు 43.8, గుడివాడ 43.6, మోపిదేవి 40.6, ఘంటసాల 39.4, ఉంగుటూరు 38.4, మచిలీపట్నం 37.6, పెడన 37.4, అవనిగడ్డ 32.2, కోడూరు 27.8, నందివాడ 27.2, పెదపారుపూడి 27.0, పామర్రు మండలంలో 26.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

ముంపులోనే పంట పొలాలు

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో ఐదురోజులు పాటు జిల్లా వ్యాప్తంగా మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయి. వర్షాల ప్రభావంతో పల్లపు ప్రాంతాల్లో వర్షపునీరు నిలిచిపోయింది. రహదారులు, కాలనీలు చెరువులను తలపించాయి. జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్‌లో 1.70 లక్షల ఎకరాల్లో ఖరీఫ్ వరి సాగుచేస్తారని వ్యవసాయశాఖ అంచనా. ఇప్పటికే దాదాపుగా అన్ని గ్రామాల్లో నాట్లు, వెద పద్ధతితో వరిసాగుచేపట్టారు. భారీ వర్షాలకు పంట పొలాలు ముంపునకు గురయ్యాయి. 45 వేల హెక్టార్ల మేర వరి పొలాలు ముంపునకు గురైనట్లు వ్యవసాయశాఖ ప్రాథమిక అంచనా వేసింది. గ్రామాల వారీగా ముంపు వివరాలను సేకరిస్తోంది. మండల వ్యవసాయాధికారులు, గ్రామ వ్యవసాయ సహాయకులు పంట పొలాల ముంపు వివరాలను సేకరిస్తున్నారు. చెరకు 12 హెక్టార్లు, పత్తి 28 హెక్టార్లు, వేరుశనగ 240 హెక్టార్లలో ముంపు బారిన పడ్డట్లు అధికారుల అంచనాలు చెబుతున్నాయి. వాతావరణం తెరిపివ్వటంతో రైతులు పంట పొలాల్లో మురుగు తొలగించేందుకు శ్రమిస్తున్నారు. అయితే పంట బోదెలు, కాలువలు మేట వేసుకుని ఉండటంతో మురుగు మళ్లింపు సమస్యగా మారింది. కాలువలు, బోదెల్లోని గడ్డి, వ్యర్థాలను రైతులే స్వయంగా తొలగించుకుని పొలాల్లోని వర్షపునీటిని మళ్లించి పంటను కాపాడుకునే యత్నం చేస్తున్నారు. కంకిపాడు మండలం కోలవెన్ను, కుందేరు పరిసరాల్లో ముస్తఫా కోడు కారణంగా 1500 ఎకరాలు ముంపు బారిన పడటంతో స్పందించిన ఎమ్మెల్యే పార్థసారథి పూడికతీతకు సూచనలిచ్చారు. దీంతో డ్రెయినేజీ విభాగం అధికారులు ప్రొక్లెయిన్‌తో ముస్తఫా కోడులోని గుర్రపుడెక్క తొలగింపు పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టారు.

కొనసాగుతున్న అలజడి

గురువారం వాతావరణం తెరిపిచ్చినప్పటికీ మబ్బులు కమ్మే ఉన్నాయి. అడపా దడపా చిరు జల్లులు పడుతున్నాయి. జిల్లా కేంద్రమైన మచిలీపట్నం సహా పలు ప్రాంతాల్లో మోస్తరు వాన కురిసింది. అల్పపీడనం తీరం దాటే సమయంలో భారీ వర్షాలు పడే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ హెచ్చరికలు రైతుల్లో అలజడి రేపుతున్నాయి. గండం గట్టెక్కితే చాలని పంటలు దక్కుతాయని వరుణుడిని వేడుకుంటున్నారు.

శిథిలమైన లోబ్రిడ్జి



కంకిపాడు మండలం మంతెనలో బుడమేరు ఉధృతితో శిథిలమైన లోబ్రిడ్జి

భారీ వర్షాలతో బుడమేరు, వన్నేరు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. కంకిపాడు మండలంలోని మంతెన పరిధిలో బుడమేరు ఉధృతంగా ప్రవహించడంతో రైల్వేట్రాక్ సమీపంలోని పంట పొలాల్లోకి వెళ్లే లో బ్రిడ్జి శిథిలమైంది. బ్రిడ్జి చప్టా మీదుగా వరద ప్రవహిస్తోంది. బ్రిడ్జి ఎగువున మంతెన, తెన్నేరు, తరిగొప్పల, కేసరపల్లి ప్రాంతాలకు చెందిన సుమారు రెండు వేల ఎకరాల మేర పంట పొలాలు ఉన్నాయి. ఇక్కడి భూముల్లోకి వెళ్లటం, సంరక్షణ చర్యలు చేపట్టడం ప్రశ్నార్థకంగా మారింది.

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గన్నవరం: విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం గన్నవరం సబ్‌స్టేషన్ పరిధిలోని మర్లపాలెం, చిన్నఅవుటపల్లి, మేఘ్న రోడ్డు, వేపగుంట రోడ్డు, కట్టుబడిపాలెం, ముదిరాజుపాలెంలో శుక్రవారం ఉదయం 8 నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు గుణదల కార్యనిర్వాహక అధికారి పి.హరిబాబు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆయా గ్రామాల విద్యుత్ వినియోగదారులు సహకరించవలసిందిగా ఆయన కోరారు.

కృష్ణానది వద్ద పహారా

పెనమలూరు: మండల పరిధిలో కృష్ణానదికి వరదలు రావటంతో ప్రధాన ఘాట్‌ల వద్ద పహారా ఏర్పాటు చేశారు. కృష్ణానదికి ప్రకాశం బ్యారేజ్ నుంచి లక్ష క్యూసెక్కులకు పైగా వరద నీరు దిగువకు వదలటంతో తీర ప్రాంతాల్లో ప్రజలను అధికారులు ప్రమత్తం చేశారు. కృష్ణానది వద్ద ఉన్న యనమలకుదురు, పెదపులిపాక, చోడవరం ఘాట్‌లకు వరద నీరు తన్ని పెట్టి ఉన్నాయి. వరద పెరిగితే కరకట్ట దిగువ నున్న పంటలకు, నివాసితులు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతాయి. నదిలోకి ఎవరూ దిగకుండా చర్యలు తీసుకున్నారు.

మండల పరిషత్‌కు చేరిన మొక్కలు



పెనమలూరు: మండల పరిషత్ కార్యాలయానికి మొక్కలు గురువారం వచ్చాయి. ఎంపీడీఓ సునీతాశర్మ వివరాలు తెలుపుతూ ప్లాంటేషన్ ఫర్ ఉమెన్ ఎంపవర్‌మెంట్‌లో భాగంగా వెయ్యి మొక్కలు వచ్చాయన్నారు. వీటిని మహిళలు సచివాలయాలు, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలు, జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలల్లో నాటు తారని తెలిపారు. నేరేడు, సీతాఫలం, మరో రెండు రకాల మొక్కలు వచ్చాయని, వీటిని శుక్రవారం నుంచి పైన తెలిపిన ప్రాంగణాల్లో నాటుతారన్నారు. కార్యక్రమంలో ఎంఈవో-1 శేషగిరిరావు, ఎంఈవో 2 కనకమహాలక్ష్మి, ఏవో లోయ శివశంకర్ రావు, సిబ్బంది పాల్గొన్నారు.

తాత్కాలిక ఆక్రమణల గుర్తింపు


నున్న(విజయవాడరూరల్): కోటకట్ట సెంటర్లో తాత్కాలిక ఆక్రమణలను గుర్తించినట్లు ఆర్ అండ్‌బీ డీఈ ఆర్.సత్యనారాయణ తెలిపారు. జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు ఆదేశాల మేరకు ఆర్‌అండ్‌బీ ఆక్రమణలపై గురువారం అధికారులు సర్వే చేసి తాత్కాలిక ఆక్రమణలను గుర్తించారు. మొబైల్‌బండ్లు, చికెన్ షాపు, బార్బర్ షాపు, హోటల్, విగ్రహం, బడ్డీకొట్లు లాంటివి మొత్తం 12 తాత్కాలిక ఆక్రమణలో ఉన్నాయని ఆర్‌అండ్‌బీ డీఈ తెలియజేశారు. మండల సర్వేయర్ రమేష్ ఆధ్వర్యంలో విలేజి సర్వేయర్లు గౌతమ్, ప్రమోదిని, వీఆర్వోలు శ్రీనివాసరావు, చాంద్, పంచాయతీ సిబ్బంది కలిసి సంయుక్తంగా ఆక్రమణలపై సర్వే నిర్వహించారు. ఆక్రమణలతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని గ్రామానికి చెందిన చంద్రశేఖర్‌రెడ్డి చేసిన ఫిర్యాదు మేరకు కోటకట్ట సెంటర్లో ఆక్రమణలను గుర్తించినట్లు డీఈ తెలియజేశారు.

రోగులకు పండ్లు పంపిణీ



గన్నవరంరూరల్: సమాజ సేవ రోటరీ క్లబ్ లక్ష్యమని రోటరీ క్లబ్ ఆఫ్ గన్నవరం అధ్యక్షుడు జాస్తి విజయభూషణ్‌కుమార్ అన్నారు. మండలంలోని చిన అవుటపల్లి డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ ఆస్పత్రిలో గురువారం క్లబ్ ఆధ్వర్యంలో రోగులకు పండ్లు, శానిటరీ నాప్కిన్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి నర్రా సీతారామారావు, సీనియర్ రొటేరియన్‌లు చింతపల్లి సీతారామయ్య, టీఎస్ఆర్‌కే ప్రసాద్, గన్నె వెంకట్రావు, డాక్టర్ ఏకాంబరేశ్వరరావు, డాక్టర్ వై.నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్‌లో శాంతియుత వాతావరణం నెలకొల్పాలి



గన్నవరం: మణిపూర్‌లో శాంతియుత వాతావరణం నెలకొల్పేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణ చర్యలు తీసుకోవాలని క్రాస్ స్పెల్ మినిస్ట్రీస్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఎ.రమేష్‌పాల్ కోరారు. ఈ మేరకు గురువారం గన్నవరం పాస్టర్స్ అండ్ క్రైస్తవ సమాజం ఆధ్వర్యంలో అల్లాపురం నుంచి స్థానిక తహసీల్దారు కార్యాలయం వరకు శాంతి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పాస్టర్లు కె.జోసఫ్ దానియేలు, ఎం.సుందరరాజు, ఎస్.రాజేష్, విక్టర్‌బాబు, కిరణ్‌కుమార్, నల్లమోతు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు నష్టం జరిగితే సహించం

- వర్షం ముంపు ప్రాంతాల్లో ఎమ్మెల్యే పార్థసారథి పర్యటన
- రైతుల నుంచి నష్టం వివరాలు సేకరణ



పునాదిపాడులో రైతులతో మాట్లాడి వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే పార్థసారథి

కంకిపాడు: రైతులకు నష్టం వాటిల్లితే సహించేది లేదని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి స్పష్టం చేశారు. ముంపు నివారణ చర్యలపై డ్రెయినేజీ, ఇరిగేషన్ శాఖల అధికారుల పనితీరుపై ఫైర్ అయ్యారు. రైతులు నష్టపోతే సీఎం దృష్టికి సమస్య తీసుకెళ్లి శాఖా పరమైన చర్యలు తీసుకునేలా చేస్తానని హెచ్చరించారు. అధిక వర్షాలకు మండలంలోని కోలవెన్ను, కుందేరు, పునాదిపాడు-ఈడుపుగల్లు డొంక ప్రాంతాల్లో ముంపు బారిన పడ్డ పంట పొలాలను ఎమ్మెల్యే పార్థసారథి గురువారం పరిశీలించారు. ఆయా గ్రామాల్లో రైతులతో మాట్లాడి వాస్తవ పరిస్థితులను తెలుసుకున్నారు. ఎకరాకు రూ. 10 వేలు నుంచి రూ. 15 వేలు వరకూ పెట్టుబడులు పెట్టామని, ముంపులోనే వరి పొలాలు ఉంటే నష్టం తప్పదని రైతులు వాపోయారు. కాలువల పూడికతీత, రియల్ ఎస్టేట్ వ్యాపారుల అడ్డగోలు నిర్మాణాల కారణంగా పంట పొలాల్లోని మురుగు బయటకు పోవటం లేదని, ముంపునకు ఇదే ప్రధాన కారణమని వివరించారు. కోలవెన్ను-కుందేరు మార్గంలోని ముస్తఫా కోడు గుర్రపుడెక్క తొలగింపు పనులను పరిశీలించి పనులు సజావుగా సాగాలని ఆదేశించారు. కాలువల పూడికతీత యుద్ధప్రాతిపదికన సాగాలని, నిర్లక్ష్యం చేస్తే చర్యలకు ఉన్నతాధికారులకు నివేదిస్తానని హెచ్చరించారు.

కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంపై ఫిర్యాదు..

జిల్లా కలెక్టర్ పి.రాజాబాబుతో ఫోన్‌తో మాట్లాడి ముంపు సమస్యపై అధికారుల వైఖరిని వివరించారు. కాంట్రాక్టర్లు నిర్లక్ష్యంగా ఉంటున్నారని, వారిని బ్లాక్ లిస్ట్‌లో పెట్టడం ద్వారా అభివృద్ధి పనులు సజావుగా సాగుతాయన్నారు. టెండర్ల ప్రక్రియ కూడా మార్చితో పూర్తయితే జూన్ నాటికి అభివృద్ధి పనులు పూర్తవుతాయని, ఆ దిశగా చర్యలు తీసుకోవాలని కోరారు.

బిల్లుల బాధ్యత నాది..

ఎమ్మెల్యే పార్థసారథి మాట్లాడుతూ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పనులు చేపట్టే క్రమంలో రైతులు, కౌలురైతులు దగ్గర ఉండి పూడికతీత పనులు చేయించుకోవాలని సూచించారు. అధికారులు అంచనాలు, అనుమతులు అంటూ నిర్లక్ష్యం చేయకుండా ముంపు సమస్య పరిష్కారానికి శాఖాపరంగా చర్యలు తీసుకోవాలన్నారు. బిల్లులు మంజూరయ్యేలా తాను బాధ్యత తీసుకుంటానని, రైతు సంక్షేమమే తనకు ముఖ్యమని అన్నారు. కార్యక్రమంలో కమ్మ కార్పొరేషన్ చైర్మన్ తుమ్మల చంద్రశేఖర్ (బుడ్డి), ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి, జెడ్పీటీసీ బాకీ బాబు, ఏఎంసీ చైర్మన్ మద్దాలి రామచంద్రరావు, సగర, గౌడ, ఉమెన్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్లు నక్కా శ్రీనివాసరావు, ఈడే చాముండేశ్వరి, నందిపాటి బిందుమాధవి, అగ్రిబోర్డు చైర్మన్ చాట్ల విజయ్‌బాబు, మాజీ చైర్మన్ నత్తా వెంకటేశ్వరరావు, సర్పంచ్‌లు, నాయకులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా పెనమలూరు చెరువు



చెరువు పక్కనే ఉన్న ఇళ్లల్లోకి చేరిన నీరు

పెనమలూరు: పెనమలూరులో ఉన్న పేరంటాళ్ల చెరువు ప్రమాదకరంగా మారింది. గత మూడు రోజులుగా కురిసిన వర్షాల కారణంగా చెరువు నిండు కుండలా దర్శనమిస్తోంది. చెరువులో నీరు ఎక్కువగా చేరటంతో చెరువు పక్కనే ఉన్న పేదల ఇళ్లల్లోకి నీరు చేరుతోంది. దీంతో నివాసితులు ఇబ్బందులు పడుతున్నారు. పెనమలూరు పేరంటాళ్ల చెరువు దాదాపు 12 ఎకరాల్లో ఉంది. అయితే చెరువు చుట్టూ పేదలు ఆక్రమించి ఇళ్లు నిర్మించుకొని ఉంటున్నారు. అయితే చెరువులోకి గ్రామంలోని డ్రెయినేజీ నీరు వచ్చి నేరుగా చేరుతోంది. చెరువు నిండి పోవటంతో చెరువు పక్కనే ఉంటున్న ఇళ్లల్లోకి మురుగు నీరు చేరింది. దాదాపు నాలుగడుగుల నీరు రావటంతో దాదాపుగా 30 ఇళ్లు పూర్తిగా మునిగిపోయాయి. ఇళ్లల్లో ఉన్న వారు ఇంటికి తాళాలు వేసి బంధువుల ఇళ్లకు వెళ్లారు. అధికారులు వెంటనే స్పందించి చెరువులో చేరిన నీరు బయటకు తీసే విధంగా చర్యలు తీసుకోవలని స్థానికులు కోరుతున్నారు.

రామలింగేశ్వరుని ఆలయ హుండీ లెక్కింపు



యనమలకుదురు ఆలయంలో హుండీ లెక్కిస్తున్న సిబ్బంది

పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో వేంచేసి ఉన్న పార్వతీ సమేత శ్రీ రామలింగేశ్వరస్వామివారి దేవస్థానంలో హుండీలు గురువారం లెక్కించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ఎం.గంగాధరరావు మాట్లాడుతూ ఆలయంలో 9 హుండీలు దేవదాయ, ధర్మదాయ శాఖ అధికారి యూవీ ప్రసాదరావు సమక్షంలో లెక్కించామన్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి 22వ తేదీ నుంచి జులై 23వ తేదీ వరకు భక్తులు స్వామివారికి సమర్పించిన కానుకలు లెక్కించామని వివరాలు వెల్లడించారు. హుండీలో మొత్తం రూ. 7,32,418 నగదు, బంగారం 4 గ్రాములు, వెండి 40 గ్రాములు వచ్చిందన్నారు. వచ్చిన కానుకలు బ్యాంకులో జమ చేస్తామని తెలిపారు. సప్తగిరి బ్యాంకు సిబ్బంది, దేవస్థాన అర్చకులు, విజయవాడ శ్రీదుర్గాసాయి సంఘం హుండీ లెక్కింపులో పాల్గొన్నారు.

నీట మునిగిన గ్రామాల్లో ప్రజాప్రతినిధులు, అధికారుల పర్యటన



రంగయ్య అప్పారావుపేటలో పర్యటిస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు



ఆరుగొలనులో నీట మునిగిన వరిపొలాలను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

హనుమాన్‌జంక్షన్‌రూరల్: అధిక వర్షాలతో ఇళ్లు, వరి పొలాలు నీట మునగటంతో నష్టపోయిన పేదలు, రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని ఆంధ్రప్రదేశ్ నాటక అకాడమీ డైరెక్టర్ నక్కా గాంధీ అన్నారు. బాపులపాడు మండలం రంగయ్య అప్పారావు పేటలో నీట మునిగిన ఇళ్లు, వరి పొలాలను గురువారం ఎంపీపీ యర్రగొర్ల నగేష్‌తో కలిసి ఆయన పరిశీలించారు. గ్రామంలో నీట మునిగిన ఇళ్లకు చెందిన కుటుంబాలకు వైఎస్సార్ సీపీ తరఫున తక్షణమే ఉచిత భోజన సదుపాయాలను కల్పించారు. ఒక్కో కుటుంబానికి రూ.వెయ్యి చొప్పున ఆర్థికసాయం పంపిణీ చేశారు. గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీ ఆదేశాల మేరకు నీట మునిగిన గ్రామాన్ని పరిశీలించి, అక్కడి ప్రజలకు ధైర్యాన్ని అందించామని గాంధీ చెప్పారు. అధిక వర్షాలతో జరిగిన నష్టాన్ని ఆయన ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి తగిన న్యాయం చేస్తారని తెలిపారు. ఎంపీటీసీ సభ్యుడు పడకల కోటేశ్వరరావు, సర్పంచ్ కాకొల్లు అన్నామణి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

వ్యవసాయ అధికారుల పర్యటన

బాపులపాడు మండలంలో అధిక వర్షాలతో వరి పంట నష్టపోయిన పొలాలను వ్యవసాయ అధికారులు గురువారం పరిశీలించారు. పలు గ్రామాల్లో పొలాల్లో నిలిచిన నీటిని బయటకు పంపేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. మండలంలో దాదాపు 639 హెక్టార్లలో వరిపంటకు నష్టం వాటిల్లినట్లుగా ప్రాథమిక అంచనా వేసినట్లు వ్యవసాయాధికారి జొన్నలగడ్డ భవాని తెలిపారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

కంకిపాడు: అధిక వర్షాలకు పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కౌలురైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.హరిబాబు డిమాండ్ చేశారు. మండలంలోని గొడవర్రు, ప్రొద్దుటూరు, నెప్పల్లి పరిసర గ్రామాల్లో కౌలురైతు సంఘం ప్రతినిధులు గురువారం పర్యటించారు. హరిబాబు మాట్లాడుతూ మండలంలో 4 వేల ఎకరాల్లో వరి పొలాలు ముంపు బారిన పడ్డాయన్నారు. నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ. 10 వేలు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

రహదారిపైకి నీరు.. ప్రయాణికుల అవస్థలు

నున్న(విజయవాడరూరల్): బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం కారణంగా కురిసిన వర్షాల వల్ల నున్న గ్రామంలో పవర్‌గ్రిడ్ ఎదురు ఆర్‌అండ్‌బీ రోడ్డు పై నీరు ప్రవహిస్తుండటంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. ఎదురెదురుగా వాహనాలు రావాలంటే మోకాలి లోతులో నీరు రోడ్డుపై నిల్వ వుండటంతో ప్రయాణికులు భయపడుతున్నారు. కొందరు వాహనదారులు లోకల్ బైపాస్ రోడ్డు నుంచి విజయవాడ వెళుతున్నారు.

రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చర్యలు



రహదారి రాకపోకలకు మట్టి పోయిస్తున్న సర్పంచ్ జేజమ్మ, ఏఈ విజయలక్ష్మి

గన్నవరంరూరల్: మండలంలోని వీరపనేనిగూడెం-కొత్తగూడెం గ్రామాల మధ్య పోలవరం కాలువ వంతెన సమీపంలో కోతకు గురైన రహదారి వద్ద రాకపోకలకు ఇబ్బందులు లేకుండా సర్పంచ్ ఆరేపల్లి జేజమ్మ గురువారం చర్యలు తీసుకున్నారు. రహదారి మధ్యలో గొయ్యి ఏర్పడటంతో రోడ్డును పంట చేల వైపునకు విస్తరిస్తూ సొంత ఖర్చు రూ.35వేలతో రోడ్డు నిర్మాణం చేశారు. దిగువ భాగంలో తూమును ఏర్పాటు చేసి దానిపై గ్రావెల్ తోలించారు. ఇప్పటికే ఏర్పడ్డ గొయ్యిని పూడ్చించేందుకు ఇంజినీరింగ్ అధికారుల సహకారంతో చర్యలు తీసుకోవాల్సి ఉందని చెప్పారు. వచ్చే వేసవిలో ఈ ప్రాంతంలో రహదారి దెబ్బతినకుండా చర్యలు తీసుకుంటామని అధికారులు చెప్పటంతో, ప్రాథమికంగా రాకపోకలకు ఇబ్బందులు లేకుండా ఈ చర్యలు తీసుకున్నారు. సర్పంచ్ జేజమ్మ ఔదార్యాన్ని గ్రామస్తులు అభినందించారు. పోలవరం ఏఈ విజయలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకుడు ఆరేపల్లి వెంకటేశ్వరరావు, పలువురు రైతులు పాల్గొన్నారు.

స్వర్ణకాంతుల నీలాకాశం



నిన్నటి వరకూ ఆకాశాన్ని కమ్మేసిన కారుమబ్బులు కొద్ది కొద్దిగా వీడుతున్నాయి. వాతావరణం తెరపిచ్చి భానుడు తన సూర్యకాంతులను ప్రసరింపజేస్తున్నాడు. గురువారం సాయంత్రం నీలాకాశంతో స్వర్ణకాంతులు తేజోమయంగా ప్రజ్వరిల్లాయి. కంకిపాడు మండలం మద్దూరు ఏటిపాయ వద్ద గురువారం సాయంత్రం ఈ దృశ్యం ఆవిష్కృతమైంది. ప్రకృతి ప్రేమికులను మంత్రముగ్ధులను చేసింది. - కంకిపాడు

అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమం



తాడిగడపలో లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న కమిషనర్ ప్రకాశరావు

ఉంగుటూరు: కులం, మతం, రాజకీయం చూడకుండా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సేవలు పారదర్శకంగా అందజేయడమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని ఎంపీపీ వి.సరోజిని అన్నారు. పెద అవుటపల్లి గ్రామ సచివాలయం వద్ద గురువారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సాంకేతిక కారణాలతో సంక్షేమ పథకం అందని వారి కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా తక్షణమే వారికి అవసరమైన సర్టిఫికెట్లు మంజూరు చేస్తున్నామని తెలిపారు. అనంతరం పలువురికి వివిధ ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. సర్పంచ్ తిరుపతమ్మ, ఎంపీడీవో శేషగిరిరావు, తహసీల్దార్ వనజాక్షి, వైఎస్సార్ సీపీ నాయకులు సాంబశివరావు, జోజి, వెంకటేశ్వరరావు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కారానికి కృషి..

పెనమలూరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఇప్పటివరకు అనేక సమస్యలు పరిష్కారించామని తాడిగడప మునిసిపాలిటీ కమిషనర్ ఎస్.ప్రకాశరావు తెలిపారు. తాడిగడప నిమ్రాకాలనీలో సచివాలయం-4లో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురికి ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు కటికల క్రిష్టోఫర్, జిన్నా, ఖాదర్‌బాషా, ముజీబ్, హర్షద్, శ్రీకాంత్‌రెడ్డి, బ్రహ్మం, నాగరాజు, బాబూరావు, వెలిశిల ప్రసాద్, పి.సాంబయ్య, పి.కిషోర్, ఎస్.కిషోర్ పలువురు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ ఆర్టీసీ డీఎం

గన్నవరం: స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో శుక్రవారం ఉదయం 11 నుంచి 12 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ పి.శివాజీ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. డిపో నుంచి ఆర్టీసీ బస్సు సర్వీస్‌లకు సంబంధించి ప్రయాణికులు విలువైన సలహాలు, సూచనలు, సమస్యలను 87909 96090 నంబర్‌కు ఫోన్ చేసి తెలియజేయగలరని సూచించారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

బాధ్యతగా సామాజిక సేవ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

కంకిపాడు: సామాజిక సేవ అందరి బాధ్యత అని కమ్మ కార్పొరేషన్ చైర్మన్ తుమ్మల చంద్రశేఖర్ (బుడ్డి) అన్నారు. చంద్రశేఖర్ పుట్టినరోజు వేడుకలు కంకిపాడులో గురువారం నిర్వహించారు. 100 మంది పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సేవాభావంతో మెలగాలని సూచించారు. ఆపన్నులను ఆదుకోవడానికి ముందుకు రావాలన్నారు. ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం కృషి చేస్తుందని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకులు నెరుసు సతీష్, కొప్పరాజు సురేష్, బండి నాంచారయ్య, పలువురు యువత పాల్గొన్నారు. కొలవెన్నులో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పార్థసారథి కేక్ కట్ చేసిశుభాకాంక్షలు తెలిపారు.

డాక్యుమెంట్స్ పోయినవి

జంగా శ్రీధరరెడ్డి S/o సంగారెడ్డి అను పేరున గల దస్తావేజు నెంబర్. 9635/2023 ది.12/7/2023వ తేదీ విజయవాడ టైమ్ హాస్పిటల్ దగ్గరలో గల జిరాక్స్ షాపునకు వెళ్తుండగా పోయినవి. ఎవరికైనా దొరికిన యెడల తెచ్చి ఇచ్చిన వారికి తగిన పారితోషికం ఇవ్వబడును. సంప్ర: ✆ 9948096118, 9848114894

అగ్ని ప్రమాద బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



బాధితురాలికి ఆర్థిక సాయం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కంకిపాడు: అగ్ని ప్రమాద బాధిత కుటుంబానికి వైఎస్సార్ సీపీ అండగా నిలిచింది. మండలంలోని తెన్నేరు గ్రామానికి చెందిన వేల్పూరి కస్తూరమ్మ పూరిల్లు రెండు రోజులు క్రితం విద్యుత్‌షార్టు సర్క్యూట్ కారణంగా ప్రమాదానికి గురైంది. ఇల్లు పూర్తిగా కాలిపోయి వృద్ధురాలు కస్తూరమ్మ నష్టపోవటంతో బాధితురాలిని వైఎస్సార్‌సీపీ నాయకులు గురువారం పరామర్శించారు. తమ వంతు ఆర్థికసాయంగా రూ. 10 వేలు బాధితురాలికి అందించారు. పార్టీ గ్రామ కార్యదర్శి లంక వెంకయ్య, అధ్యక్షుడు మట్టా నాగరాజు, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు కలపాల వజ్రాలు, నాయకులు ఉప్పలూరు సునీల్, వేల్పూరి సీతయ్య, వేల్పూరి అర్జునరావు చేతులమీదుగా ఆర్థిక సాయాన్ని అందించి, అండగా ఉంటామని హామీ ఇచ్చారు.